పౌరులకు రక్షణ కవచాలుగా
న్యాయ, పాలనా వ్యవస్థలు

• గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ • రాజ్ భవన్‌లో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

అమరావతి, ఆంధ్రప్రభ : న్యాయ, పాలనా వ్యవస్థలు ప్రజలకు రక్షణ కవచాల వంటివని, భారత రాజ్యాంగం దౌశ పౌరులకు విభిన్న హక్కులను అందించిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. దేశ పౌరులు తమ హక్కులను సంరక్షించుకోవడమే కాకుండా, వారి బాధ్యతలను గుర్తెరిగి వ్యవహరించాలన్నారు. భారత రాజ్యాంగాన్ని ఆవిష్కరించుకుని 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ తరుణంలో రాజ్‌భవన్‌లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్, సీవీఆర్ కళాశాల, తక్షశిల ఐఎఎస్ అకాడమీకి చెందిన విద్యార్థులు పాల్గొనగా, గవర్నర్ బిశ్వభూషన్ విద్యార్థులు, న్యాయ మూర్తులు, ఆహ్వానితుల తో రాజ్యాంగంలో పొందుపర్చిన ప్రాథమిక విధులపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ పౌరులు అందరికి సమాన హక్కులు కల్పించిందని, చట్టం ముందు అందరూ సమానమేనని, స్పష్టం చేశారు స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ చేపట్టిన అహింసా పోరాటాన్ని ఆదర్శంగా తీసుకొని యువత ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ జితేంద్ర కుమార్ మహేశ్వరి మాట్లాడుతూ.ప్రజల చేత, ప్రజల కోసం, ప్రజల కొరకు అనేది భారత రాజ్యాంగంలో కీలకమైన అంశం కాగా, దేశంలోని ప్రతి ఒక్కరికి రాజ్యాంగపరమైన హక్కులు, విధులు, బాధ్యతలు విస్పష్టంగా పొందుపరచ బడ్డాయన్నారు, ఈ రోజును సంవిధాన్ దివాస్‌గా కూడా పిలుస్తున్నామని వివరించారు.

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని మాట్లాడు తూ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాం గం అందరికీ ఆదర్శమన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రి కొడాలి నాని, డీజీపీ గౌతమ్ సవాంగ్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, గవర్నర్ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, రాజ్ భవన్ సంయుక్త కార్యదర్శి అర్జునరావు, జిల్లా కలెక్టర్ ఇంతి యాజ్ అహ్మద్, విజయవాడ సీపీ ద్వారకా తిరుమలరావు, నగర ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

గిరిజనులకు సంపూర్ణ పోషణ

• కొత్త పథకానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం • నీతి అయోగ్,నేషనల్ హెల్త్ ప్లాన్ ప్రకారం రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో తీవ్రంగా పౌష్టికాహార లోపం • రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలు, 77 ఏజెన్సీ మండలాల్లో అమలు • ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లోని గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు మరింతగా పౌష్టికాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతన పథకానికి శ్రీకారం చుట్టింది. గర్భిణీల్లో రక్తహీనత, పిల్లల్లో ఎదుగుదల, వారి ఆరోగ్యరీత్యా అదనపు పౌష్టికాహారాన్ని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ' పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభిస్తోంది. దీనికి సంబంధించి మంగళవారం జీఓఎస్ నెం. 16 ను విడుదలచేసింది. రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలపరిధిలో ఉన్న గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ పథకాన్ని అమలపరచబోతోంది. దీని ప్రకారం బాలింతలకు ప్రతిరోజూ వేడి, వేడి అన్నంతో పాటు, గుడ్డు, పాలు, గోధుమపిండి, మిల్లెట్లు, వేరుశనగ చిక్కీలు, ఇతర బలవర్ధక ఆహారాన్ని అందించనున్నారు. పిల్లలకు కూడా ప్రతిరోజూ గుడ్డు, పాయసం, బిస్కెట్లు, ఇతర పౌష్టికాహారాన్ని సమకూర్చిపెట్టనున్నారు.

గిరిజన ప్రాంతాల్లో తీవ్రంగా పౌష్టికాహార లోపం

పేదరికం, అవగాహన లేకపోవటం, అపరిశుభ్ర వాతావరణంతో గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు ప్రధానంగా గర్భిణీలు, చిన్నపిల్లల్లో పౌష్టికాహార లోపం విపరీతంగా ఉంటోంది. అంతేకాక పరిశుభ్రమైన తాగునీరు కూడా వీరికి అందే పరిస్థితి లేదు. దీంతో వీరికి రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలు తరచూ ఉత్పన్నమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-4లోనూ ఈ విషయం స్పష్టమైంది. బాలింతల్లో అనీమియా, పిల్లలు వయసు తగ్గ బరువు ఉండకపోవటం, ఎత్తుకు తగ్గ బరువు లేకపోవటం, తదితర అంశాలురాష్ట్రంలో గిరిజన ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలో నీతి అయోగ్, యూనిసెఫ్, నిన్, వరల్డ్ బ్యాంకు, కేర్ ఇండియా వ్యవస్థలు కూడా గిరిజనుల జీవన విధానాన్ని మెరుగుపరిచేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాయి. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ప్రకారం రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లాలో 71.8శాతం మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. అలాగే విజయనగరంలో 75.5శాతం,విశాఖలో 66.4శాతం, తూర్పుగోదావరిలో 64.6శాతం మహిళలు రక్తహీనతతో ఇబ్బందిపడుతున్నారు. ఈ క్రమంలోనే నీతి అయోగ్ 1000 రోజుల ప్రణాళికలను గిరిజన ప్రాంతాల్లో అమలుచేయాలని సూచించింది. దీనికోసం మంచి ఆహారాన్ని అందించాలని పేర్కొంది.

బాలింతలపై రూ.1062, పిల్లలపై రూ.600 లు ప్రతినెలా వ్యయం

రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ పోషణ పథకం కింద గర్భిణీలు, బాలింతలకు ప్రతినెలా రూ. 1062 విలువైన ఆహారాన్ని అందించనుంది. వీరికి నెలలో 25 రోజుల పాటు రోజుకు 125గ్రా.చొప్పు వేడి,వేడి అన్నం, 30గ్రా.పప్పు, 16గ్రా.నూనె, 50గ్రా. కూరగాయాలు అందించనున్నారు. అలాగే 25 రోజులపాటు ప్రతిరోజూ గుడ్డు, ప్రతిరోజూ 200మి.పాలు, మిల్లెట్, ప్రోటీన్, ఐరన్ అందించే ఇతర ఆహారపదార్థాలు ఇవ్వనున్నారు. అలాగే నెలలో మొదటి వారం రెండు కేజీల గోధుమపిండి, రెండవ వారం 500గ్రా. వేరుశనగ చిక్కి, మూడవ వారం 500గ్రా.రాగిపిండి, 500గ్రా.బెల్లం, 4వ వారం 500గ్రా.ల నువ్వుల లడ్డూలను పౌష్టికాహారం కింద అందించనున్నారు. అలాగే 6 నుంచి 36 నెలల వయసు ఉన్న పిల్లలకు ప్రతిరోజూ ఒక గుడ్డు, 200గ్రా.పాలు, 25రోజులపాటు 100గ్రా. బాలామృతాన్ని అందించనున్నారు. దీనికి ప్రతి ఒక్కరికి రూ. 600ల చొప్పున వ్యయం అవుతుంది. అలాగే 36 నుంచి 72 నెలల వయసు లోపు ఉన్న పిల్లలకు 75 గ్రా.చొప్పున 25 రోజుల పాటు వేడి అన్నం, ఆయిల్, పప్పు, కూరగాయలు అందించనున్నారు. అలాగే 25రోజులపాటు గుడ్డు, 200గ్రా.పాలు 25 రోజులపాటు, ప్రతిరోజూ పాయసం లేదా లడ్డూ లేదా బిస్కెట్లను ఇవ్వనున్నారు. దీనిపై ప్రభుత్వం ప్రతి ఒక్కరిపై నెలకు రూ. 560లను వ్యయం చేస్తుంది.

సంపూర్ణ పోషణకు శ్రీకారం

ఈ అంశాలన్నింటినిపరిగణనలోకి తీసుకున్న జగన్ సర్కార్.. గిరిజనుల ఆరోగ్య పరిస్థితులు మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో గిరిజనులకు మంచి ఆహారాన్ని అందించేందుకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల పరిధిలో ఉన్న సీతంపేట, పాడేరు, రామచంద్రపురం, చింతూరు, కేఆర్‌పురం, శ్రీశైలం గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ పథకాన్ని అమలుపరచనుంది. ఈ పరిధిలోని 77 షెడ్యూల్డ్ ట్రైబల్ సబ్ ప్లాన్ మండలాల్లో ఈ పథకాన్ని అమలుపరిచేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అంగన్‌వాడీ కార్యకర్తలు దీనిలో ప్రత్యేక శ్రద్ధ వహించబనున్నారు. మహిళలు గర్భం ధరించిన దగ్గర నుంచి వారికి పిల్లలు పుట్టి, వారికి రెండు సంవత్సరాల వయసు వచ్చే వరకు ప్రత్యేక ఆహారాన్ని అందించనున్నారు. అలాగే ఆరు నెలల పిల్లల నుంచి 72 ఎలల వయసున్న పిల్లలకు కూడా సంపూర్ణ పోషణ ద్వారా పౌష్టికాహారం అందించనున్నారు. ఈ పథకాన్ని ప్రతి నిత్యం పర్యవేక్షించేందుకు వీలుగా కామన్ అప్లికేషన్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించనున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సీడీపీఓలు ప్రతి ఇంటికి వెళ్లి, వివరాలు నమోదు చేసుకుని, వారికి ప్రతినెలా ఈ పౌష్టికాహారాన్ని అందించనున్నారు. ఈప్రక్రియను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల ఆమోదం, పర్యవేక్షణలో సాగనుంది.

ఉన్మాద పాలన!

• దమనకాండ సాగుతోంది • అధికార దుర్వినియోగానికి పరాకాష్ట • వైసీపీ బాధితుల సమావేశంలో చంద్రబాబు

కడప, ప్రభన్యూస్ : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం దమనకాండను సాగిస్తోందని, ఉన్మాదుల్లా ఆ పార్టీ నాయకులు వ్యవహరిస్తూ.. రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నారని సీఎం నియోజకవర్గం పులివెందుల్లో కూడా అక్కడి వైసీపీ నాయకులు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారని రాష్ట్ర వ్యాప్తంగా ఈ దురాగతాలను ప్రజలు భరించాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కడప జిల్లాలో రెండవరోజు పర్యటన లో భాగంగా మంగళవారం ఆయన స్థానిక శ్రీనివాస కళ్యాణ మండపంలో వైసీపీ బాధితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదేశంలో రాజ్యాంగం అమలు పరచి 70 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు.

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగం రూపకల్పనకు ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. ఆయన ఈ సందర్భంగా అంబేద్కర్ మాటలను ఉటంకిస్తూ రాజ్యాంగం ఎంత మంచిదైనా దానిని అమ లు చేసేవారు మంచివారు కానట్లయితే అది చెడు ఫలితాన్ని ఇస్తుందన్నారు. చెడు వ్యక్తులు పరిపాలన చేయడం వలన చెడు ఫలితాలను పొందుతామని గత ఆరు నెలలుగా వైఎస్ జగన్ రాష్ట్రంలో ఇదే పాలనను కొనసాగిస్తున్నారంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఇంతటి అరాచక పాలన ఎప్పుడూ చూడలేదన్నారు. బ్రిటిష్ వారు మన ఆస్తులను దోచుకెళ్ళారని ప్రస్తుతం పరిపాలన చూస్తుంటే అంత కంటే దారుణంగా వుందన్నారు. పరాకాష్టకు అధికార దుర్వినియోగం రాష్ట్రంలో పాలకులు రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతూ అధికార దుర్వినియోగంతో వ్యవహరిస్తున్నారని వీరి తీరు పరాకాష్ఠకు చేరిందన్నారు. టీడీపీ కార్యకర్తలు ఎటువంటి తప్పు చేయకున్నా నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి వేదిస్తున్నారని ఆయన ఆరోపించారు. మానవహక్కుల ఉల్లంఘన సాగుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం మీడియా ప్రతినిధులపై దాడులు ఎక్కువ య్యాయని అన్నారు. అలాగే ఇటీవల మీడియా స్వేచ్ఛను నియంత్రించేందుకు జివోను తీసుక వచ్చారన్నారు. ఎంతటి దుర్మార్గులైన కాలగర్భంలో కలసి పోవాల్సిందేనని ఆయన దుయ్యబట్టారు. మన కార్యకర్తలను బాధ పెట్టిన వారికి కూడా అదే గతి తప్పదని ఆయన హెచ్చరించారు.

వైసీపీ నాయకులు ఆంబోతుల్లా మారి ఊర్లపై పడు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యకర్తలు ధైర్యంగా ఉంటూ మనోనిబ్బరం కోల్పోకూడదని, వీరి అరాచక పాలనకు అంతం పాడే రోజు దగ్గరలోనే వుందని చంద్రబాబునాయుడు అన్నారు.

కన్నీటి పర్యంతమైన పులివెందుల బాధితుడు

పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలం తూగుట్ల మధుసూదన్ రెడ్డి అనే 70 సంవత్సరాల వృద్ధ రైతు కన్నీళ్ళ పర్యంతమవుతూ తన ఆవేదనను చంద్రబాబు ఎదుట ఏకరు వు పెట్టారు. పార్టీ మారకపోతే చంపుతామంటూ వైసీపీ నేతలు బెదిరిస్తున్నారని ఆయన సమావేశంలో విలపించారు. ఇందుకు స్పందించిన చంద్రబాబు పార్టీ అండగా వుంటుందని ఆయనకు భరోసానిస్తూ ఆర్థిక సాయం అందించారు. సీఎం సొంత నియోజక వర్గంలో నే రైతులు, కార్యకర్తలు అనేక ఇబ్బందులు పడుతున్నా రని ఇదేమి పాలన అంటూ ఆయన దుయ్యబట్టారు. ప్రజాస్వా మ్యాన్ని కాపాడుకోడానికి వైసీపీపై ప్రతి కార్యకర్త పోరాడాల్సిన అవసరం వుందని ఆయన పిలుపునిచ్చారు. వీరబల్లిమండలం నాగసుబ్బమ్మ అనే మహిళ వంట ఏజెన్సీని రద్దు చేస్తే హైకోర్టుకు వెళ్ళడం జరిగిందని ఆ న్యాయ స్థానం ఆమెకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ అధికారులు ఆ ఆదేశాలను అమలు చేయకపోవడం సిగ్గు చేటన్నారు. ఈ ప్రభుత్వం చట్టాన్ని గౌరవించలేదని అనేందుకు ఇదొకనిదర్శనమని పేర్కొన్నారు. గత కొన్ని నెలలుగా తెలుగుదేశం కార్యకర్తలకు చెందిన ఆస్తులు ధ్వంసం సాగుతోందని దీనిపై కార్యకర్తలు న్యాయస్థానాల్లో పైవేటు కేసులు నమోదు చేసు కోవాలని ఆయన సూచించారు. బాధితుల సమావేశంలో పంట లు ప్రత్యర్థుల చేతిలో ధ్వంసమైన బాధితులకు రూ.50 వేల చొప్పు న ఆర్థికసాయం చంద్రబాబు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ బిటెక్ రవి, మాజీ ఎమ్మెల్సీలు పుత్తా నరసింహారెడ్డి, బత్యాలచెంగల్రాయుడు పాల్గొన్నారు.

సీనరేజీ వేలం!

అధికారులతో చర్చించిన మంత్రి పెద్దిరెడ్డి

అమరావతి,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ఇసుక అక్రమ రవాణా నియంత్ర ణకు పటిష్ట నిఘా ఏర్పాటులో భాగంగా చెక్ పోస్టులు,సీసీ కెమెరాల ఏర్పాటు వ్యవస్థను వేగవంతం చేయాలని, గనులశాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో రాష్ట్రంలోని గనులు, సీనరేజీ, లీజ్‌లపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సెప్టెంబర్ 5వ తేదీ నుంచి అమలులోకి వచ్చిన నూతన ఇసుక విధానంపై సమీక్షించారు. ఇసుక రవాణాపై పర్యవేక్షణకు ఏర్పాటు చేయాల్సిన చెక్ పోస్ట్‌లను, సీసీ కెమేరాల వ్యవస్థను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. అలాగే రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో సీజరేజీ వసూళ్లను వేలం ద్వారా నిర్వహించాలనే అంశంపై అధికారులతో చర్చించారు.

2018లో మహాచెక్ పేరుతో జరిగిన వ్యవహారంలో అవతవకలపై వెంటనే విచారణ జరపాలని ఆదేశించారు. దీనికి సంబంధించిన నివేదికలను వారం రోజుల్లో సమర్పించాలని కోరారు. రాష్ట్రంలో బైరటీస్ గనుల్లో పుల్లరీస్ వెలికితీతకు ముందుకు వచ్చే వారికి ఎపీఎండీసీ ద్వారా అనుమతులు ఇచ్చే అంశంపై అధికారులతో చర్చించారు.గనులకు సంబంధించి సచివాలయంలో జరిగే రివిజన్ పిటీషన్‌లలో విచారణ అనంతరం నిర్ణీత సమయంలో రివిజన్ ఆర్డర్‌లను క్వారీ నిర్వాహకులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో మైనింగ్ కార్యదర్శి రామ్ గోపాల్, మైనింగ్ వైస్ చైర్మన్ అండ్ ఎండీ మధుసూదన్ రెడ్డి జాయింట్ డైరెక్టర్ డబ్ల్యూబి చంద్రశేఖర్ లు సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

రైల్వే శాఖ ఆధ్వర్యంలో
సంవిధాన్ దివస్

రాజ్యాంగ ప్రతిజ్ఞ చేసిన రైల్వే అధికారులు

అమరావతి, ఆంధ్రప్రభ : భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో రైల్వే అధికారులు మంగళవారం సంవిధాన్ దివస్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డివిజనల్ రైల్వే మేనేజర్ పి. శ్రీనివాస్ మాట్లాడుతూ 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగానికి ఆమోద ముద్ర పడిందని గుర్తు చేశారు. 1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చిందని తెలిపారు. ఈ నేపథ్యంలో రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్ జయంతి అయిన నవంబర్ 26ను రాజ్యాంగ దినోత్సవంగా నిర్వహించాలని అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా 2015లో కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని వివరించారు. కనుక ప్రతి సంవత్సరం ఈ రోజున రాజ్యాంగం గురించి, అంబేద్కర్ ఆశయాల గురించి స్మరించుకోవడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలో వివిధ ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. రాజ్యాంగం ఆమోదం పొంది 70 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో రాజ్యాంగానికి సంబంధించిన అంశాలపై ర్యాలీలు, రన్‌లు, చర్చలు, సమావేశాలు, క్విజ్, డిబేట్ తదితర కార్యక్రమాలను ఏడాదిపాటు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం రైల్వే ఉన్నతాధికారులు, సిబ్బందితో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఎంఎస్ డా. ఎ. సత్యనారాయణ, ఏడీఆర్ఎంలు ఎంవీఎస్ రామరాజు, జి. సుమన, సీనియర్ డీసీఎం పి. భాస్కర్ రెడ్డి, ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫారం-A
బహిరంగ ప్రకటన
(ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్సీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఇన్‌సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పొరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016లోని రెగ్యులేషన్ 6 క్రింద)
జిజిసి ప్రాజెక్ట్స్ లిమిటెడ్ యొక్క ఋణదాతలకు గమనిక

సంబంధిత వివరములు		
1.	కార్పొరేట్ డెటార్ పేరు	మెస్సర్స్ జిజిసి ప్రాజెక్ట్స్ లిమిటెడ్
2.	కార్పొరేట్ డెటార్ నమోదు తేది	05-04-2004
3.	కార్పొరేట్ డెటార్ నమోదు కాబడ / రిజర్వ్ కాబడ అథారిటీ	ఆర్ఓసి - హైదరాబాద్
4.	కార్పొరేట్ డెటార్ యొక్క కార్పొరేట్ ఐడెంటిటీ నెంబరు / లిమిటెడ్ లయబిలిటీ ఐడెంటిఫికేషన్ నెంబరు	U45200TG2004PLC043015
5.	కార్పొరేట్ డెటార్ యొక్క నమోదిత కార్యాలయం మరియు ప్రిన్సిపల్ ఆఫీస్ (ఏదేని) చిరునామా :	సర్వే నెం.9(పి), సిఐఐ గ్రీన్ బిల్డింగ్స్ లైన్, హైటెక్ సిటీ, కొండాపూర్, హైదరాబాద్, తెలంగాణ, 500084, ఇండియా
6.	కార్పొరేట్ డెటార్‌కు సంబంధించి ఇన్‌సాల్వెన్సీ ప్రారంభ తేది	21-11-2019 (ది.25-11-2019 నుండి అర్డర్ అందుబాటులో ఉంది)
7.	ఇన్‌సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రాసెస్ అంచనా ముగింపు తేది	18-05-2020
8.	ఇంటరిమ్ రిజొల్యూషన్ ప్రొఫెషనల్‌గా వ్యవహరిస్తున్న ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్ పేరు మరియు రిజిస్ట్రేషన్ నెంబరు	మధుసూధన్ రావు గొనుగుంట & IBBI/IPA-001/IP-P00181/2017-18/10360
9.	బోర్డితో నమోదైన ప్రకారం ఇంటరిమ్ రిజొల్యూషన్ ప్రొఫెషనల్ చిరునామా మరియు ఇ-మెయిల్	7-1-285, ఫ్లాట్ నెం.103, శ్రీ సాయి నివాస్, సంపద అపార్ట్‌మెంట్స్, బల్కంపేట, సంజీవరెడ్డి నగర్, హైదరాబాద్, తెలంగాణ-500038. ఇ-మెయిల్ : madhucs1@gmail.com
10.	ఇంటరిమ్ రిజొల్యూషన్ ప్రొఫెషనల్‌తో సంప్రదించుటకు వినియోగించే చిరునామా మరియు ఇ-మెయిల్	7-1-285, ఫ్లాట్ నెం.103, శ్రీ సాయి నివాస్, సంపద అపార్ట్‌మెంట్స్, బల్కంపేట, సంజీవరెడ్డి నగర్, హైదరాబాద్, తెలంగాణ-500038. ఇ-మెయిల్ : gkcirp@gmail.com, madhucs1@gmail.com
11.	క్లెయిమ్‌లు దాఖలు కొరకు చివరి తేది	09-12-2019
12.	ఇంటరిమ్ రిజొల్యూషన్ ప్రొఫెషనల్ పబ్లిషుడ్ నెట్ షీట్ 21లోని సబ్-క్లజ్ (iii)లో క్లాజ్ (b) క్రింద ఏవేని క్లెయిమ్స్ తరగతి	భాతా పుస్తకాల ధృవీకరణ ద్వారా గుర్తించబోతాము
13.	తరగతిలో క్లెయిమ్స్ యొక్క అర్హత ప్రతినిధిగా వ్యవహరించుటకు గల్గించబడిన ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్స్ పేర్లు (ప్రతి తరగతి కొరకు మూడు పేర్లు)	ప్రస్తుతము వర్తించదు
14.	(a) సంబంధిత ఫారాలు మరియు (b) అర్హత ప్రతినిధుల వివరాల లభ్యత :	వెబ్‌సైట్ : https://ibbi.gov.in/home/downloads భౌతిక చిరునామా : వర్తించదు

నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, 21-11-2019న మెస్సర్స్ జిజిసి ప్రాజెక్ట్స్ లిమిటెడ్ యొక్క కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించిందని ఇందుమూలంగా తెలియజేయడమైనది. మరియు ఆర్డర్ 25-11-2019న అందుబాటులో ఉంచబడింది. ఎంట్రీ నెం.10 వద్ద తెలిపిన చిరునామా వద్ద మెస్సర్స్ జిజిసి ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌కు 09-12-2019న లేదా ఆలోగా రుజువుతో తమ క్లెయిమ్‌లను దాఖలు చేయవల్సిందిగా మెస్సర్స్ జిజిసి ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌యొక్క ఋణదాతలను ఇందుమూలంగా కోరడమైనది. ఆర్థిక ఋణదాతలు ఎలక్ట్రానిక్ విధానం ద్వారా మాత్రమే రుజువుతో తమ క్లెయిమ్‌లు దాఖలు చేయాలి. ఇతర ఋణదాతలు అందరూ స్వయంగా, తపాలా ద్వారా లేదా ఎలక్ట్రానిక్ విధానం ద్వారా రుజువుతో క్లెయిమ్‌లు దాఖలు చేయవచ్చును. ఎంట్రీ నెం.12కు ఎదురుగా పేర్కొన్న ప్రకారం తరగతికి చెందిన ఒక ఫైనాన్షియల్ క్రెడిటార్, ఫారం CHలోని తరగతిలో (తరగతి నిర్దిష్ట పరచండి) అర్హత ప్రతినిధిగా వ్యవహరించుటకు ఎంట్రీ నెం.13కి ఎదురుగా పేర్కొన్న ముగ్గురు ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్స్ నుండి అర్హత ప్రతినిధి యొక్క తమ ఛాయిస్‌ను తెలియజేయవలెను - ప్రస్తుతం వర్తించదు. తప్పుదోవ పట్టించే లేదా తప్పుడు రుజువులతో క్లెయిమ్‌లు సమర్పించినచో జరిమానాలు విధించబడును.

తేది : 27-11-2019
ప్రదేశం : హైదరాబాద్
ఇంటరిమ్ రిజొల్యూషన్ ప్రొఫెషనల్ యొక్క పేరు మరియు సంతకం
సం/- మధుసూధన్ రావు గొనుగుంట

భరతమాత ముద్దుబిడ్డ
బీఆర్ అంబేద్కర్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ

అమరావతి, ఆంధ్రప్రభ: భిన్నత్వంలో ఏకత్వం అంటూ భారత రాజ్యాంగం ద్వారా అందరికీ సమానత్వం కల్పించిన మహా నీయుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ కొనియాడారు. అంబేద్కర్‌ను ఏ ఒక్క కులానికో, మతానికో ఆపాదించొద్దని ఆయన కోరారు. బీజేపీ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు మంగళవారం విజయవాడలో నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, రాష్ట్రపార్టీ వ్యవహారాల సహ ఇన్‌చార్జి సునీల్ థియోడర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అనేక దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసిన అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రూపొందించినట్లు తెలిపారు.

1949 నవంబర్ 26న భారత రాజ్యాం గం ఆమోదం పొందగా, 2015 నుంచి మోడీ రాజ్యాంగ దినోత్సవంగా జరపాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పేదల సంక్షేమానికి ప్రధాని నరేం ద్ర మోడీ 130 సంక్షేమ పథకాలు అమలు చేస్తుండగా రాష్ట్రప్రభుత్వాలు స్టిక్కర్లు వేసుకొని తమ విగా ప్రచారం చేసుకుంటున్నాయన్నారు. దేశంలోనే అతి పెద్దదైన 300 అడుగుల విగ్రహాన్ని ప్రధాని మోడీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా అంబేద్కర్ నడియాడిన ఐదు ప్రాంతాలను గుర్తించి పర్యాటక ప్రదేశాలుగా అభివృద్ధి చేసేం దుకు నిర్ణయించి నట్లు చెప్పారు. దళితులు జాబ్ ప్రొవై డర్లుగా ఉండాలనే స్టార్టప్ వంటి కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుందే తప్ప తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని ఆరోపించారు. తన రాజ్యాంగ రచన ద్వారా అంబేద్కర్ భారతదేశాన్ని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా నిలబెట్టినట్లు చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వ తీరు ఆక్షేపణీయం

దేవాలయ భూముల విషయంలో రాష్